# అపరాజితుడు

ఒక కార్పొరేట్ యోధుని జీవన సమర విజయ గాథ

**సునీల్ రాబర్ట్**

అనువాదం

**సత్య భావన**

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | శిఖరపు అంచున | ix |
| 1. | ఇదీ మొదలు | 1 |
| 2. | సుడిగాలిలోన దీపం | 23 |
| 3. | రాటుదేలిన తిరుగుబాటుధోరణి | 57 |
| 4. | మళ్ళీ చిగురించిన క్షణాలు | 80 |
| 5. | జీవితమే ఓ పాఠశాల | 101 |
| 6. | పేదరికం లోంచి ప్రేమానురాగాల లోకి | 131 |
| 7. | శిఖరపు అంచున | 167 |
| | కన్నబిడ్డలకు ప్రేమతో | 197 |

# శిఖరపు అంచున

వేలమంది కూర్చోవడానికి వీలైన సువిశాలమైన ఆడిటోరియం అది... సాయంకాలం నియాన్ లైట్ల వెలుగుల్లో, కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతిలో, ఆ రేయి ముస్తాబైంది. మదినిమీటే పాశ్చాత్య సంగీతం. మనసును దోచే నృత్యాల సోయగాల నడుమ... అంతా పండగ వాతావరణం... ఒకరినొకరు కళ్లతోను మాటల్తోను పలకరించుకుంటున్నారు. ఒకవైపు చేతిలో షాంపైన్ గ్లాసులు, మరోచేత్తో కరచాలనాలతో ఒకరినొకరు అభినందించుకుంటున్నారు. నల్లసూటు బూటు, ఎర్రగౌన్లతో అక్కడి ఆడామగా అంతా మెరుస్తున్నారు. విజయం అందించిన అతిశయం అది. గొప్ప విజయోత్సవాన్ని జరుపుకుంటున్న ఆ వేదిక మీద ప్రపంచంలోని టెక్నాలజీ రంగాన్ని ఏలే రారాజులు అంతా కొలువుతీరారు.

ఐ.టి. ప్రపంచంలోని వివిధ విభాగాల్లో నిష్ణాతులైనవారికి ఏటా ఇచ్చే ''స్టీవీ'' అవార్డుల పండుగ అది. టెక్నాలజీ రంగానికి సంబంధించి ఆస్కార్ అవార్డుకు సరితూగేదన్నమాట. ఆ సంవత్సరం విభిన్న రంగాల్లో విజయాలు సాధించిన వారిని గుర్తించి అభినందించి. అవార్డును అందిస్తున్నారు. క్రియేటివ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ రంగంలో నేను సాధించిన విజయానికిగాను ఈ సంవత్సరం ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేశారు. 30 దేశాలనుంచి వచ్చిన నామినేషన్లను పరిశీలించిన తర్వాత నాకందించబోయే అవార్డు అది. ఈ అవార్డును అందుకునే మొదటి ఆసియా పౌరుణ్ణి కూడా నేనే. ఇంతకు ముందు ఎన్నోసార్లు అలాంటి ఫంక్షన్లు నేనెరుగుదును. కంపెనీని విజయం దిశగా నడిపే ప్రస్థానంలో ఇలాంటి ఎన్నో గ్రాండ్ ఫంక్షన్లకు నేను హాజరైనా ''స్టీవీ అవార్డ్'' అనేది నామటుకు నాకు ప్రత్యేకం. ఒక్కసారి కూర్చున్న చోటి

నుంచి చుట్టూ పరిశీలించి చూశాను. నా చుట్టూ కొన్నివేలమంది... ఎంతో టాలెంట్ వున్నవారే అందరూ... టూకీగా చెప్పాలంటే ప్రపంచ దేశాల్లో వున్న మేధావులంతా ఒకచోట చేరినట్టు వున్న సభ అది. ఆ వేదికమీదనుంచి, వ్యాఖ్యాత ఒక్కోరిపేరు పిలుస్తూ వేదికమీదికి ఆహ్వానిస్తుంటే, అవార్డు ప్రదానం చేస్తున్నారు. అవార్డు పొందే వారికున్న అర్హతని పొగుడుతూ, వారి కృషిని... అక్కడ వున్నవారందరికీ క్లుప్తంగా పరిచయం చేస్తున్నారు.

ఒకరితర్వాత ఒకరిపేరు వస్తోంది... ఇంతలో నాపేరూ వచ్చింది... సునీల్ రాబర్ట్.

అదేపేరు. సునీల్ రాబర్ట్... ఎన్నోసార్లు ఫీజు కట్టలేదన్న కారణం చేత క్లాసులో మాస్టారు చదివిన పేరు.

అదేపేరు సునీల్ రాబర్ట్... పెంకి స్నేహితులందరూ, నా చింకీ ప్యాంటుని మాత్రమే గుర్తుంచుకుని, మరిచిన నా అసలు పేరు.

అదే పేరు సునీల్ రాబర్ట్... యూనివర్శిటీ క్యాంపస్‌లో వరుస బంగారు పతకాలను వరించిన పేరు.

అదే పేరు... సునీల్ రాబర్ట్... నా కంపెనీ, నేడు గర్వంగా తలెత్తుకోవడానికి కారణమైన పేరు.

ఆపేరు వినగానే ఎందుకు తెలీదు... పాత స్మృతులన్నీ ఒక్కసారి మదిలో మెదిలాయి...

ఓ వైపు, అక్కడి కరతాళ ధ్వనులు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే మరోవైపు నా హృదయం కేరింతలతో పొంగిపోతోంది. ఆ ఆనందంలో తన్మయత్వంతో కూర్చున్న చోటినుంచి లేచి, వేదికవైపు అడుగులు ఎలా వేశానో తెలీదు.

ఒక్కటిమాత్రం తెల్సు.

ఈ చప్పట్ల వెనక ఒకప్పుడు ఎన్నో ఇక్కట్లు వుండేవనీ. ఈ ఆనందానికి ముందున్నవన్నీ ఆవేదనలే అనీ. ఐతే ఆనాడు ఈనాడు నాది అదే నడక. అవే అడుగులు విజయం దిశగానే సాగుతున్నాయి.

ఈవేళ... ఇంతమంది మధ్య హుందాగా వున్న సూట్‌లో దర్జాగా నడుస్తూ వెళ్తున్న నేను... నాకంటికినేనే అచ్చు రేమండ్ అడ్వర్టయిజ్‌మెంట్‌లో హీరోగా కన్పిస్తున్నాను. కాదు మరీ. ఇక నా చొక్కాకు వున్న అతుకులు దాచుకోవాల్సిన పనిలేదు.

ప్యాంట్ చిరుగుల పైనవున్న ప్యాచ్‌ల కోసం బాధపడవలసిన అవసరం లేదు. మండే ఎండని కూడా చూడకుండా మాటతప్పి, అరికాలి మంటలను నాకు పూర్తిగా సొంతం చేసిన 'చెప్పుల జత'ను నిందించనవసరం లేదు.

అవును. ఎందుకంటే ఇప్పుడు నేను విజేతను. కాలం ఒడిలో, బ్రతుకు చేజారిపోకుండా, జీవితాన్ని ఒడుపుగా పట్టుకుని నన్నునేనుగా మల్చుకున్న అద్భుత శిల్పాన్ని.

కంగ్రాచ్యులేషన్ ఇలా ఎన్నో ఆలోచనల దొంతరలతో ఉక్కిరిబిక్కిరవుతున్న నాకు Congratulation's Sunil... అంటూ అవార్డును నాచేతికందిస్తున్న Tanya Beekett (Editor BBC America) మాటల్తో ఈ లోకంలోకి వచ్చి పడ్డాను.

అవార్డు చేతిలోకి తీసుకోగానే కలిగిన ఆనందానికి అవధుల్లేవు! అప్పటికే నా స్పందనకోసం ఎదురుచూస్తున్న సభని ఉద్దేశించి నా ఉపన్యాసాన్ని నాలుగు వాక్యాల్లో ముగించాను.

బ్యాంకింగ్ రంగంలో ఐ-ఫ్లెక్స్ విజయకేతనం ఎగురవేసిన తీరు, వివిధ దేశాల్లో ముచ్చటగా మూడు ఖండాల్లో పనిచేస్తూ కంపెనీ ఖ్యాతిని నిలిపిన వైనాన్ని వివరిస్తూ ముగించాను.

వేదిక దిగి వస్తున్న నన్ను అభినందనలతో ముంచెత్తారు తోటిమిత్రులు, నా కంపెనీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ అంతా. సూపర్! యు డిజర్వ్ ఇట్ ! అద్భుతం! నీకు మాత్రమే రావాల్సిన అవార్డ్ ఇదీ అంటూ వుంటే అభినందనలు, ఆత్మీయతలు, ఆనందాల మిశ్రమం మినహా నా కోసం మరేమీ లేవక్కడ.

సాధించా... ఇదే నే కలలు కన్న ప్రపంచం. ఇందుకోసమే నేను పడిన శ్రమంతా...

కళ్లల్లో ఓ పల్చటి నీటిపొర. ఎడారికి ఆవల నిధిని వెతుకుతూ వెళ్ళిన యువకుడికి దార్లో ఎదురైన ఎండమావుల్లా అప్పటికే నా అడుగడుగునా అవమానాలతో, అణువణువూ కుమిలిపోతూ గడిచిన రోజులూ, వద్దనుకుంటున్నా ఇవాళ మళ్ళీ గుర్తొస్తున్నాయ్ గురుతుకు రావాలేమోకూడా. నేడు మహావృక్షంగా ఎదిగిన నాకు. నా మూలాలు ఎక్కడివో/ఎలాంటివో గుర్తుండాలికదా. అప్పుడే. పెనుతుఫానులకి సైతం కుంగకుండా లొంగకుండా నేను స్థిరంగా దృఢంగా నిలబడగలిగేలా వుండగలను.

నేను దాటివచ్చిన రోజులన్నీ మీకు ఇందాక వివరించిన అందమైన సాయంకాలాల లాంటివి కావు అంతకు పూర్తిభిన్నంగా, నన్ను గాఢాంధకారంలోకి నెట్టివేసి, కుంగదీసిన రోజులవి. ఐనా ఒక మొండి ధైర్యం, విశ్వంపై అనంత విశ్వాసం, నా స్వశక్తిపై నమ్మకంతోనే ఆ చీకట్లను తరిమికొడుతూ ఇవాళ ఇన్ని వేల విద్యుద్దీపాల కాంతిని నా జీవితంలోకి ఆహ్వానించాను.

# ఇదీ మొదలు

**అ**వి నేను ప్రైమరీ స్కూల్లో చదివే రోజులు. హైదరాబాద్‌లోని రాంనగర్ అనే బస్తీలో మేము నివసిస్తుండేవాళ్ళం. ఈ ప్రాంతం ఉస్మానియా యూనివర్శిటీకి అతి చేరువలో, నగరం నడిబొడ్డున వుండేది... రాంనగర్ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు బస్సు సౌకర్యం ఉండటం వల్లనైతేనేమి, అక్కడ చుట్టు పక్కల (ఆజామాబాద్) ప్రాంతంలో పరిశ్రమలు ఉండటమైతేనేమి, ఈ ప్రాంతం యూనివర్శిటీకి కూత వేటు దూరంలో ఉండటంవల్ల కానీయండి... మా రాంనగర్‌లో ఇళ్లకు చాలా డిమాండ్ ఉండేది. మధ్యతరగతి ఉద్యోగస్తులు, చిన్న చితకా చేతివృత్తులవాళ్ళు మొదలు, కాయకష్టం చేసుకునే రోజు కూలీలు, పల్లెటూరి నుంచి పట్టణానికి చేరి చదువుకునే విద్యార్థులు ఇలా ఉన్నవాళ్ళు, లేనివాళ్లని లేకుండా అందర్నీ ఆ ప్రాంతం అక్కున చేర్చుకునేది.

ఆ ఏరియాలో ఒకవైపు ఉడుకు రక్తంతో ఊగిపోయే కుర్రాళ్ళుంటే, మరోవైపు కడుపు నిండనప్పుడు కూడా కాలర్‌పైకెత్తి తిరుగుతూ, చిన్నచిన్న గొడవలు సృష్టించే అల్లరి మూకలతోపాటు ఇంకాస్త కరడుకట్టిన (కేడీ) గ్యాంగులు కూడా ఉండేవి. అదేం చిత్రమోకానీ, అలాంటి వాళ్ళందరినీ రౌడీలనీ, గూండాలనీ బయటి ప్రపంచం ముద్రవేసినా సరే వాళ్లంతా మాకంటికి మాత్రం మామూలు వాళ్ళలాగే కన్పించేవారు. పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదన్నట్టు... ఎంతపెద్ద రౌడీ అయినా వాడు పక్కింటి వాడో పక్కవీథిలో వాడో అన్న భావనే తప్ప భయం ఉండేది కాదు మాకు.

ఉదయం నిద్రలేస్తే మనతోనే, మనలో ఒకడిగా తిరిగే ఓ వ్యక్తి, సాయంత్రం అయ్యేసరికి ఏ గొడవకో, పబ్లిక్ న్యూసెన్స్‌కో కారణమని తెలిసినా... అది చాలా మామూలైన విషయంలా ఎవరిపనుల్లో వారుండేవారు. ఇంకా చెప్పాలంటే, అడపాదడపా చుట్టూ పక్కల వాళ్ళెవరైనా, పెద్ద గొడవలు సృష్టించడమో, ఇంకాస్త ముందుకెళ్ళి దొమ్మిలోనో, దోపిడీకేసులోనో ఇరుక్కుంటే బయట పోలీసుల దగ్గర చిక్కి, వారి మర్యాదలు అందుకుని బయటికొస్తే, ఇక కాలనీలో ఆ రోజు అతనే హీరో.